ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
బుధవారం 10 జూలై 2024





వైసీపీ ప్రభుత్వంలో ఇలా రంగులు మార్చారు..

‘టిడ్కో’.. అందుకో..!



2019 మార్చి నాటికే పూర్తయిన టిడ్కో గృహ సముదాయం


ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదల ఇళ్లకు పట్టిన గ్రహణం ఎట్టకేలకు తొలగనుంది. టీడీపీ అధికారంలోకి రావడంతో త్వరలోనే టిడ్కో గృహాలకు మోక్షం కలగనుంది. ఏళ్ల తరబడి ఎదురు చూస్తూ వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన పేదల సొంతింటి కల నెరవేరనుంది. 2014 - 2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత నాణ్యతతో కూడిన, షేర్ వాల్ టెక్నాలజీతో ఆధునిక అపార్ట్‌మెంట్ల నిర్మాణ జరిగింది. ఇళ్లు లేని పేదలకు నీడ కల్పించేందుకు రూ. వందలాది కోట్ల వ్యయంతో రాష్ట్రంలో గృహ సముదాయాలను నిర్మించారు. ఇందులో భాగంగానే నంద్యాలలో కూడా దాదాపు పది వేల గృహాల నిర్మాణానికి కార్యాచరణ చేపట్టి దాదాపు 85 శాతం పనులను అప్పట్లో పూర్తి చేశారు. కొన్ని గృహాల నిర్మాణం పూర్తి కావడంతో 2019 ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు లబ్ధిదారుల చేత గృహ ప్రవేశ కార్యక్రమాలను కూడా టీడీపీ ప్రభుత్వం నిర్వహించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడ్కో గృహాలను గాలికి వదిలేసింది. దీంతో టిడ్కో గృహ సముదాయాలన్నీ ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయి విష పురుగులకు నిలయంగా మారాయి.

ఉచితంగా ఇస్తున్నామనే ప్రచారం..

గతేడాది మొదట్లో టిడ్కో గృహాలను ఉచితంగా ఇస్తున్నామంటూ వైసీపీ ప్రభుత్వం సొంత డబ్బా ప్రచారం చేసుకుంది. పెండింగ్ పనులను పూర్తి చేయకుండానే గృహ ప్రవేశాలంటూ ఆర్భాటాన్ని వైసీపీ నాయకులు ప్రదర్శించారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఎస్‌ఆర్‌బీసీ కాలనీలో టీడీపీ ప్రభుత్వ హయాం ముగిసే నాటికి పూర్తయిన గృహాలకే వైసీపీ రంగులు వేసి కొంత మంది లబ్ధిదారులను చేర్పించారు. ప్రస్తుతం ఎస్‌ఆర్‌బీసీ కాలనీలో మాత్రమే 250 మంది లబ్ధిదారులు తమ గృహాల్లో ఉంటున్నారు. విద్యుత్ శాఖ 700 గృహాలకు మీటర్లను ఇచ్చినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాల పూర్తికి మోకాలొడ్డి తన రంగుల పిచ్చిని మాత్రం ప్రదర్శించింది. ప్రతి బ్లాక్‌కు వైసీపీ రంగులు అద్దడానికి మాత్రం నిధులు ఖర్చు చేసిన ఆ పార్టీ, మౌలిక వసతులు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం వహించింది.

టీడీపీ అధికారంలోకి రావడంతో..

ఐదేళ్ల వైసీపీ పాలనకు జనం చరమగీతం పాడటంతో టీడీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో టిడ్కో గృహ లబ్ధిదారుల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. టిడ్కో గృహాలను వీలైనంత త్వరగా పూర్తి చేసి తమకు అందిస్తారన్న నమ్మకం లబ్ధిదారుల్లో నెలకొంది.



- త్వరలోనే పేదల ఇళ్లకు మోక్షం
- లబ్ధిదారుల్లో వెల్లువిరుస్తున్న ఆనందం
- ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రహణం
- టీడీపీ రావడంతో సొంతింటి కల సాకారం
- జీ+3 విధానం.. షేర్ వాల్ టెక్నాలజీతో నిర్మాణం

నంద్యాల టౌన్, జూలై 9: పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ఎన్‌టీఆర్ గృహ నిర్మాణంలో భాగంగా గృహాలు అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్నాయి. పేదవారు సైతం ధనవంతుల ఇళ్ల తరహాలో సౌకర్యవంతంగా, సొంతింట్లో నివాసం ఉండేందుకు వీలుగా అప్పట్లో టీడీపీ ప్రభుత్వం నాణ్యతకు పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా షేర్‌వాల్ టెక్నాలజీని వినియోగించారు. భూమిలో పునాదుల నుంచి జీ+3లో భాగంగా పై అంతస్తు వరకు మొత్తం సిమెంట్, కాంక్రీట్‌తో గోడలు, స్లాబ్‌లు వేశారు. ఇందులో ఒక్క ఇటుకను కూడా వాడలేదు. ఈ అపార్ట్‌మెంట్లలో వంట గదిలో గ్రానైట్‌తో కూడిన కిచెన్ ప్లాట్ ఫాం, ఫ్లోరింగ్‌కు రెక్టిఫైడ్ టైల్స్, పూజగది, బెడ్ రూమ్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రతి బ్లాక్‌కు ప్రత్యేకంగా మంచినీటి సౌకర్యం కోసం ఓవర్ హెడ్ ట్యాంక్‌ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. గృహ సముదాయాల ఆవరణలో సీసీ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, గ్రీనరీకి కార్యాచరణ సిద్ధం చేశారు.

మూడు ప్రాంతాల్లో నిర్మాణాలు

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 42 వార్డులు ఉన్నాయి. ఇందులో సొంత ఇల్లు లేని పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు పట్టణ పేదలకు ప్రత్యేకంగా ఎన్‌టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా జీ+3 విధానంలో షేర్‌వాల్ టెక్నాలజీతో అపార్ట్‌మెంట్లను నిర్మించారు. వీటికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక, ప్లాట్ల కేటాయింపు అత్యంత పారదర్శకతతో నిర్వహించారు. ఎస్‌ఆర్‌బీసీ కాలనీ ఆవరణ, నందమూరి నగర్, అయ్యలూరు మెట్ట మూడు ప్రాంతాల్లో టిడ్కో గృహ సముదాయాల నిర్మాణం జరిగింది.

నిర్మాణాలు చేపట్టారు ఇలా..

జీ+3 విధానంలో పది వేల గృహాల నిర్మాణానికి రూ.700 కోట్లు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.150 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఏపీ టిడ్కో సంస్థ ఆధ్వర్యంలో ప్రఖ్యాత గృహ నిర్మాణ కాంట్రాక్టు సంస్థ షాపూర్‌జీ, పల్లోమ్‌జీ నిర్మాణ సారథ్యంలో ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. క్యాటగిరి-1 కింద 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో సింగిల్ బెడ్ ఇంటిని రూ.5.65 లక్షలు, క్యాటగిరి-2 కింద 365 అడుగుల సింగిల్ బెడ్ ఇంటిని రూ.6.65 లక్షలతో, క్యాటగిరి -3 కింద 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.7.65 లక్షల అంచనా వ్యయంతో నిర్మించారు. ఆయా క్యాటగిరిల ప్రకారం నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు ఎంపిక చేసి ఒక్కొక్కరికి కేంద్రం నుంచి రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1.50 లక్షలు సబ్సిడీ ఇచ్చి మిగతా మొత్తాన్ని బ్యాంక్‌ల నుంచి రుణ సహాయాన్ని అందించేలా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో క్యాటగిరి -1 కింద 300 చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన గృహాలు 8704, క్యాటగిరి-2 కింద 365 చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన గృహాలు 288, క్యాటగిరి -3 కింద 430 చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన గృహాలు 1008 పూర్తి చేయడంలో భాగంగా 85 శాతం పనులు కూడా 2019 ఎన్నికలకు ముందుగానే పూర్తయ్యాయి. కొన్నింటి పనులు పూర్తి కావడంతో లబ్ధిదారులకు అప్పట్లో గృహ ప్రవేశ కార్యక్రమాలను సైతం నిర్వహించారు.



పేదల గోడుతోనే వైసీపీ పలాయనం



రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన టిడ్కో గృహాలకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించింది. రాష్ట్ర వ్యాప్తంగా పేదలు, అన్ని వర్గాల ప్రజలకు తీరని నష్టం కలిగింది. వారి గోడుతోనే వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు కూలదోశారు. ప్రజల నమ్మకాన్ని టీడీపీ ప్రభుత్వం కచ్చితంగా నిలుపుకుంటుంది. టిడ్కో గృహాల పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ దృష్టికి తీసుకెళ్తాం. వీలైనంత త్వరగా లబ్ధిదారులకు అందజేస్తాం.

- ఎన్‌ఎండీ ఫరూక్, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి

ఐదేళ్ల సైకో పాలనలో నిర్లక్ష్యం

టిడ్కో గృహ నిర్మాణాలు టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు 85 శాతం పూర్తయినప్పటికీ మిగిలిన 15 శాతం పనులను జగన్ ప్రభుత్వం పూర్తి చేయలేదు. టీడీపీని టార్గెట్ చేసిన వైసీపీ నాయకులు కూడా టిడ్కో గృహాలను పూర్తి చేయడానికి అవసరమైన నిధులు విడుదల కాకుండా అడ్డుకున్నారు. 15 శాతం పనుల్లో మంచినీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీల ఏర్పాట్లు, రోడ్ల నిర్మాణం, తదితర పెండింగ్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రస్తుతం టిడ్కో గృహాల సముదాయం చిన్నపాటి అడవుల మధ్య ఉన్నట్లుగా దృశ్యాలు అగుపిస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ టైల్స్, పెయింటింగ్ డబ్బాలు, గృహాల్లో లోపల పగిలిపోయిన ఫ్లోరింగ్, దెబ్బతిన్న వాకిళ్లు, పిచ్చి మొక్కల కారణంగా పాములు, ఇతర విషపురుగుల సంచారం మధ్య టిడ్కో గృహాలు దర్శనమిస్తున్నాయి.



అధికారులతో సమావేశమైన కలెక్టర్ రాజకుమారి

రైతులు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోండి

- వ్యవసాయ అధికారులను ఆదేశించిన కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూలై 9: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయాలని కలెక్టర్ రాజకుమారి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రగతిపై సంబంధిత అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాల బెడద అధికంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. సబ్సిడీపై, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులను సకాలంలో పంపిణీ చేయాలని అధికారును ఆదేశించారు. సాగు నీటి ప్రాజెక్టులు, 124 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా నీటి లభ్యతను బట్టి సాగునీరు అందించే విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ అందుకు అనుగుణంగా పంటలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పారిశుధ్య లోపాన్ని నివారించండి

రాష్ట్ర వ్యాప్తంగా డయారియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో ఎక్కడా పారిశుధ్యం లోపం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.రాజకుమారి పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో తాగునీటి సదుపాయం, పారిశుధ్య లోపాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మనోహర్, జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి పాల్గొన్నారు.

కంది పప్పు, బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేయండి: జేసీ

నంద్యాల (కల్చరల్), జూలై 9: రైతు బజార్లలో కంది పప్పు, బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరపాలని అధికారులను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రైస్ మిల్లర్లు, దాల్ మిల్లర్లతో ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వహించారు. బియ్యం, కందిపప్పు ధరలు మార్కెట్ రేటు కన్నా తక్కువ ధరకు అమ్మాలని మిల్లర్లను సూచించారు. నంద్యాల పట్టణంలో శ్రీనివాసనగర్ రైతుబజారు, టెక్కె మార్కెట్‌యార్డు, ఆళ్లగడ్డ, ఆత్మకూర్, డోన్ మండలంలో గల మార్కెట్‌లలో కౌంటర్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లైస్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం రైతు బజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో కందిపప్పు రూ. 160, సోనామసూరి ఫైన్‌రైస్ (స్టీమ్‌డ్) రూ.49, రా ఫైన్ రైస్ రూ.48గా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక కౌంటర్లు గురువారం ఉదయం 7గంటలకు ప్రారంభించబడుతుందని ఆయన తెలిపారు. ఈ కౌంటర్లు ఉదయం 7గంటల నుంచి 12గంటల వరకు సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాలోని వినియోగదారులు తమ ఆధార్‌కార్డుతో పాటు క్యారీ బ్యాగులు తీసుకొని కొనుగోలు చేసుకోవాలని తెలిపారు.

గోరుకల్లు రిజర్వాయర్ ప్రమాదంలో ఉంది

- సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిని కలెక్టర్‌కు వివరించిన బొజ్జా

నంద్యాల టౌన్, జూలై 9: పాణ్యం మండలంలోని గోరుకల్లు రిజర్వాయర్ ప్రమాదపుటంచుల్లో ఉందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిసి రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిని, నీటి లభ్యతలపై వివరించారు. జిల్లాలో కేసీ కెనాల్ ఆయకట్టుకు ఏ రోజు వరకు సాగు నీటిని అందిస్తారో చెప్పలేని పరిస్థితి ఉందని, దీంతో ఏ పంటలు వేసుకోవాలో అర్థంగాని పరిస్థితుల్లో రైతులు ఉన్నారని తెలిపారు. అనంతరం రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిపై తాను రచించిన నీటి అవగాహనే - రాయలసీమకు రక్ష అనే పుస్తకాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన అన్ని అంశాలతో పాటు సాగునీటి అంశంపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని అన్నారు. త్వరలోనే కార్యాచరణను రూపొందించి చర్చిద్దామని సాగునీటి సాధన సమితి ప్రతినిధుల బృందంతో పేర్కొన్నారు. కార్యక్రమంలో సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వైఎన్ రెడ్డి, ఏర్వ రామచంద్రారెడ్డి, మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నిట్టూరు సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న బొజ్జా దశరథ రామిరెడ్డి తదితరులు



చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

ఉచిత ఇసుక.. ప్రగతికి బాట

రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ

బనగానపల్లె, జూలై 9: ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా ఖనిజ సంపదను కొల్లగొట్టారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఒక్క ఇసుకలోనే వైసీపీ నేతలు రూ.50వేల కోట్లు దోచుకున్నారని ఆయన ఆరోపించారు. మంగళవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి మంత్రితో పాటు టీడీపీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకు వచ్చిన ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాటగా మారిందన్నారు. ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యులకు భారీ ఉరట లభించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే అమలులోకి తెచ్చారన్నారు. ఫ్రీశాండ్ పాలసీ అమలు చేస్తూ జీవో నంబరు 43 విడుదల చేయడం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. ఇసుక మాఫియాతో వైసీపీ నేతలు కోట్లు కొల్లగొట్టారన్నారు. జగన్‌తో పాటు ఆయన హయాంలో పనిచేసిన మంత్రులందరూ ఇసుక మాఫియాను నడిపించారన్నారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్‌కో మింగేసిదన్నారు. జగన్ బినామీ సంస్థ జేపీ వెంచర్స్ చెల్లించాల్సిన మొత్తం నుంచి రూ.800 కోట్లు మినహాయించి ప్రజాధనాన్ని ధారాదత్తం చేశారని మంత్రి విమర్శించారు. పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఖర్చు అయితే ఇందులో ఇసుక కొనేందుకే రూ.3 లక్షలు ఖర్చు పెట్టాల్సి వచ్చేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీని అధికారులు నిరంతర పర్యవే క్షణ చేస్తారన్నారు. రాష్ట్ర ప్రజల ప్రగతే ధ్యేయంగా పాలసీని రూపొందించామన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు నిబంధనల మేరకు పర్యావరణం దెబ్బతినకుండా ఉచిత ఇసుకను అందిస్తామన్నారు. జిల్లా స్థాయిలో శాండ్ కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టర్, జాయింట్ కలెక్టరు, ఆర్డీవోలు, మైనింగ్ అధికారులు నిరంతరం ఇసుక రవాణాలో అక్రమాలు జరగకుండా పర్యవేక్షించనున్నట్లు మంత్రి తెలిపారు.

గిరిజన బాలుడిపై చిరుతపులి దాడి



చిరుత పులి దాడిలో గాయపడిన గిరిజన బాలుడు నాగన్న

మహానంది, జూలై 9: మహానంది సమీపంలోని ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన గిరిజన బాలుడు నాగన్నపై మంగళవారం రాత్రి చిరుతపులి దాడి చేసింది. కాలనీ సమీపంలోని నల్లమల అడవిలోకి నాగన్న బహిర్భూమికి వెళ్లాడు. వెనుక వైపు నుంచి చిరుత వచ్చి హఠాత్తుగా నాగన్నపై దాడి చేసి గాయపర్చింది. వెంటనే అప్రమత్తమై పరుగులు తీశాడు. కేకలు వేసుకుంటూ చెంచుగూడెంకు చేరుకున్నాడు. తనపై చిరుతపులి దాడి చేసిందని జరిగిన విషయాన్ని కాలనీ ప్రజలకు తెలిపాడు. దీంతో భయభ్రాంతులకు గురయ్యారు. మహానంది పరిసర ప్రాంతాల్లో గత కొంతకాలంగా చిరుతపులి సంచరిస్తున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోక పోవడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిరుతను బంధించడంలో నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు ఆందోళనలు నిర్వహించడానికి సిద్ధమవుతు న్నారు. ఇప్పటికైనా ఎలాంటి ప్రాణనష్టం జరగకముందే అటవీశాఖ అధికారులు చిరుతను బోను సహాయంతో బంధిం చి సుదూర ప్రాం తానికి తరలిం చాలని స్థానిక ప్రజలతో పాటు భక్తులు కోరుతున్నారు.

ఈ కాలువల్లో నీరు పారుతుందా?

● గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ● దృష్టి సారించిన టీడీపీ ప్రభుత్వం

● తాత్కాలిక పనులకు రూ.19.29 కోట్లు కావాలి



కౌతాళం మండలం రౌడూరుకు సాగు నీరు అందించే ఎల్లెల్సీ దుస్థితి ఇది



ఎల్లెల్సీ



కేసీ కాలువ దుస్థితి



గాజులదిన్నె ప్రాజెక్టు ఆయకట్టు దిగువన ఎడమ కాలువ దుస్థితి

కర్నూలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే పంట కాలువలను మరమ్మతు చేయాలి. ఆయకట్టుకు రైతులకు సాగునీరు అందేలా చూడాలి. ఇది ప్రభుత్వాల కనీస బాధ్యత. అయితే.. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. రైతులకు అత్యంత ముఖ్యమైన పంట కాల్వలను కనీసంగా పట్టించుకోలేదు. ఎత్తిపోతల పథకాల నిర్వహణకు నిధులు ఇవ్వలేదు. ఇటీవల కొలువుదీరిన టీడీపీ ప్రభుత్వం పంట కాలువల మరమ్మతులపై దృష్టి సారించింది. తక్షణ మరమ్మతుల కోసం ఎన్ని నిధులు కావాలో జలవనరుల శాఖ సీఈవోల నుంచి ప్రతిపాదనలు తీసుకుంది. ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రాష్ట్రంలో ప్రాజెక్టులు, కాలువపై తాజా పరిస్థితిని సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు నీరు ఇవ్వాలని దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాజెక్టులు, పంట కాలువ పరిధిలో తక్షణ మరమ్మతులకు రూ.19.29 కోట్లు నిధులు అవసరమని సీఈ కబీర్‌బాషా నివేదిక ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), కర్నూలు-కడప (కేసీ) కెనాల్, గాజులదిన్నె ప్రాజెక్టు, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు (జీఆర్‌పీ), శ్రీశైలం జలాశయం, తెలుగుగంగ ప్రాజెక్టు (టీజీపీ), సిద్ధేశ్వరం లిఫ్ట్ స్కీం, ఎస్ఆర్‌బీసీ, గాలేరు-నగరి సుజల స్రవంతి (జీఎన్ ఎస్ఎస్) వంటి భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా సాగునీటి వనరుల కింద సరాసరి 8 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగు నీరు ఇవ్వాల్సి ఉంది. గత జగన్ ప్రభుత్వం సాగునీటి వనరులైన పంట కాలువలు, ఎత్తిపోతల పథకాలు, ప్రాజెక్టు మరమ్మతులపై అంతులేని నిర్లక్ష్యం చూపారు. ఫలితంగా పలు కాలువలు అధ్వానంగా మారాయి. పూడిక, ముళ్ల కంపలతో నిండిపోయాయి. ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాలకు ప్రధాన జీవనాడి అయిన కేసీ కాలువ కర్నూలు సమీపంలోనే పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కర్నూలు నగరం మురుగు నీరంతా చేరి గుర్రపుడెక్క, ముళ్లకంప, రబ్బరు చెట్లు పేరుకుపోయాయి. పశ్చిమ ప్రాంతంలో ప్రాణ జలాలు అందించే తుంగభద్ర దిగువ కాలవ, గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు, గాజులదిన్నె ప్రాజెక్టు కాలువలు అధ్వానంగా మారాయి. గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాలువ ఆనకట్ట దిగువన ప్రమాదకరంగా మారింది. నంద్యాల జిల్లాలోని ఎస్ఆర్‌బీసీ, తెలుగుగంగ ప్రాజెక్టు కాలువలతో పాటు సిద్ధేశ్వరం ఎత్తిపోతల పథకం పరిస్థితి దాదాపు ఇదే. తక్షణ మరమ్మతులకు నిధులు ఇవ్వకపోతే.. ప్రాజెక్టుల్లో వరద నీరు చేరినా చివరి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వలేని పరిస్థితి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేసినా ఆ ఫలితంగా ఆయకట్టు రైతులు అనుభవించాల్సిన దైన్య పరిస్థితి ఉందని అంటున్నారు. కొన్ని మండలాల్లో రైతులే చందాలు వేసుకొని లిఫ్టులు, కాల్వలు మరమ్మతులు చేసుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

● ప్రాజెక్టుకు చేపట్టాల్సిన పనులు, నిధులు.. రూ.లక్షల్లో..

ప్రాజెక్టు/కాలువ	పనులు	నిధులు
కేసీ కాలువ	35	317.28
టీబీపీ ఎల్లెల్సీ	17	238.19
గాజులదిన్నె ప్రాజెక్టు	5	89.26
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	13	232.03
శ్రీశైలం ప్రాజెక్టు	4	79.14
తెలుగుగంగ ప్రాజెక్టు	42	393.78
సిద్ధేశ్వరం ఎత్తిపోతల పథకం	12	148.59
ఎస్ఆర్‌బీసీ కాలువ	42	356.85
గాలేరు-నగరి ప్రాజెక్టు	8	73.85
మొత్తం	178	1928.97

● రూ.19.28 కోట్లు ఇవ్వండి:

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల తాజా పరిస్థితులపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సీఈలతో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, నిధులు అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో ఏ ఏ ప్రాజెక్టు, కాలువ తాత్కాలిక మరమ్మతులకు ఎంత నిధులు అవసరమో క్షేత్ర స్థాయి ఇంజనీర్ల ద్వారా నివేదికలు తెప్పించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో తక్షణ మరమ్మతులకు రూ.19.28 కోట్ల నిధులు ఇవ్వాలని ఉమ్మడి కర్నూలు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టుల సీఈ కబీర్‌బాషా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే రైతులకు కాల్వలపై కన్నీటి కష్టాలు తీరినట్లేనని అంటున్నారు. ఈ విషయాన్ని సీఈ కబీర్‌బాషా దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా ఉమ్మడి జిల్లాలో ఆయా ప్రాజెక్టులు, కాలువలు తక్షణ మరమ్మతులకు రూ.19.28 కోట్లు నిధులు కావాలని ప్రతిపాదనలు పంపిన మాట నిజమే. రైతులకు ఎలాంటి సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష సమావేశంలో పలు సూచనలు చేశారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

● అన్నమయ్య జిల్లా పీలేరు దగ్గర రోడ్డు ప్రమాదం

● మృతులు కోసిగికి చెందిన ఇద్దరు మహిళా వలస కూలీలు

● మరో నలుగురికి తీవ్ర గాయాలు





అంజినమ్మ, కౌతాళం లక్ష్మి (ఫైల్)

కోసిగి, జూలై 9: కర్నూలు జిల్లా కోసిగి మండల కేంద్రం నుంచి బతుకుదెరువు కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందగా.. మరో నలుగురు తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు సొంత ఊరిలో పనులు లేక పొట్ట చేతపట్టుకుని పిల్లాపాపలతో అన్నమయ్య జిల్లా పీలేరు దగ్గర సిమెంటు కూలీ పనికి రెండు నెలల క్రితం వలస వెళ్లారు. సోమవారం యథావిధిగానే పనులు ముగించుకుని రాత్రి ఆటోలో వస్తుండగా.. వెనుక వైపు నుంచి టిప్పర్ వేగంగా ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ఉన్న 8 మంది ప్రయాణికుల్లో కోసిగిలోని రెండో వార్డుకు చెందిన కౌతాళం లక్ష్మి (18), 9వ వార్డుకు చెందిన ఉల్లి అంజినమ్మ (38) అక్కడికక్కడే మృతి చెందారు. అంజినమ్మ కూతురు మల్లికకు రెండు కాళ్లు విరిగిపోయాయి. కౌతాళం లక్ష్మి అన్న నరసింహులు తలకు బలమైన గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉంది. అలాగే మరో బంధువైన పెద్ద తుంబళం అయ్యన్నకు తీవ్ర గాయాలయ్యాయి. అంజినమ్మ కూతురు మల్లిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ఈ ఘటన వలస కూలీల కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. కోసిగిలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన ఇద్దరు మహిళా కూలీల భౌతికకాయాలకు మంగళవారం కోసిగికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, జూలై 9: కొలిమిగుండ్లలోని జమ్ములమడుగు రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బెలుం గ్రామానికి చెందిన శేఖర్(25) మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. శేఖర్ మోటార్ సైకిల్‌పై ఉయ్యాలవాడకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న జీపు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తాడిపత్రి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు సీఐ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

శ్రీశైలం దేవస్థానంలో అంతర్గత బదిలీలు

71 మంది ఉద్యోగులకు స్థాన చలనం

శ్రీశైలం, జూలై 9: ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం దేవస్థానంలో ప్రక్షాళన దిశగా భారీగా అంతర్గత బదిలీలు జరిగాయి. మంగళవారం 71 మంది శాశ్వత, ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందిని అంతర్గతంగా బదిలీ చేస్తూ ఆలయ కార్య నిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ బదిలీలు దేవస్థానంలో పరిపాలన సౌలభ్యం దృష్ట్యా చేపట్టినట్లు పేర్కొన్నారు. బదిలీలలో ఏఈవో మోహన్‌ను గోశాల, గ్యాస్ గోడౌన్, పెట్రోల్ బంకులు, వైద్యశాలలకు కేటాయించారు. పీఆర్వో టి.శ్రీనివాసరావుకు ప్రజాసంబంధాలు, మీడియా అడ్వైజర్‌లతోపాటు అదనంగా వసతి, ప్రొటోకాల్, టోల్‌గేట్, కాల్‌సెంటర్ విభాగాలను కేటాయించారు. పరిపాలనా విభాగాన్ని కె. వెంకటేశ్వరరావుకు అప్పగించగా, కె. బ్రహ్మయ్యను, బాల కార్తీక్‌గౌడ్‌ను ఈవో సీసీ బాధ్యతలు కేటాయించారు. స్థానచలనం పొందిన సిబ్బంది వెంటనే ఉత్తర్వుల ప్రకారం సదరు అధికారులకు కేటాయించిన విధులలో వెంటనే రిపోర్టు చేయాలని ఈవో పెద్దిరాజు ఆదేశించారు.

నీట్ పేపర్ లీకేజీపై స్పందించాలి

● పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్రపతికి లేఖలు



రాష్ట్రపతికి పంపనున్న పోస్టుకార్డును చూపుతున్న విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 9: నీట్ పేపరు లీకేజీపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి పోస్టు ద్వారా రాష్ట్రపతికి లేఖలను పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పేపరు లీకేజీతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని ఆరోపించారు. నీట్ పేపరు పరీక్ష లీకేజీ సూత్రధారులను శిక్షించకుండా సంబంధం లేని వ్యక్తులను అరెస్టు చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. నేషనల్ టెస్టు ఏజెన్సీ పేపరు లీకేజీ చేసి అవినీతి అరాచకాలకు పాల్పడిందని ఆరోపించారు. తక్షణమే ఎన్‌టీయేను రద్దు చేయాలని రాష్ట్రపతిని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, తేజ్, రాజీవ్, లక్ష్మణ్‌రావు, శివప్రసాద్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు జీజీహెచ్‌ని అభివృద్ధి చేస్తాం

ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(హాస్పిటల్), జూలై 9: కర్నూలు ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేస్తామని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం కర్నూలు ఎంపీ మొదటిసారిగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పర్యటించారు. ముందుగా కార్డియోథొరాసిక్, ఐసీయూ, కార్డియాలజీ, డయాలసిస్ విభాగాల్లో తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్‌రెడ్డితో కర్నూలు ఎంపీ పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలో వలసలు అధికంగా ఉంటాయని, ఈ ప్రాంత ఆరోగ్య సంజీవని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో తీసుకెళ్లానన్నారు. ఆసుపత్రిలో త్వరలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి కావాల్సిన నిధులు, ఖాళీ పోస్టులపై చర్చిస్తామన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో ఆఫీసును తనిఖీ చేశారు. డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్, అడిషినల్ డీఎంహెచ్‌వో డా.భాస్కర్‌లు ఎంపీకి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో పోస్టులను పెంచాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎంపీని కోరారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలు నాయక్, రాష్ట్ర కార్యదర్శి అబ్రహం, రాష్ట్ర ఈసీ సభ్యులు సురేష్, లోకేశ్, హరిశ్చంద్ర నాయుడులు ఎంపీని కలిశారు. కర్నూలు ఎంపీ వెంట ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఏఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



కార్డియోథొరాసిక్ ఓటీ వార్డులో పర్యటించిన ఎంపీ బస్తిపాటి

దొరకని బాలిక ఆచూకీ

డాగ్ స్క్వాడ్‌తో ఎత్తిపోతల పథకం వద్ద గాలింపు

క్షుద్రపూజల కలకలం





ముచ్చుమర్రిలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు, ముచ్చుమర్రి ఎత్తిపోతల సమీపంలో క్షుద్ర పూజలు చేసిన దృశ్యం

పగిడ్యాల, జూలై 9: మండల పరిధిలోని కొత్త ముచ్చుమర్రి మజరా గ్రామమైన ఎల్లాలకు చెందిన వాసంతి అనే బాలిక ఆచూకీ లభ్యం కాలేదు. నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశాల మేరకు పోలీసులు డాగ్ స్కాడ్‌తో మంగళవారం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం గ్రామానికి చేరుకున్న నందికొట్కూరు సీఐలు విజయభాస్కర్, ప్రకాష్ కుమార్ కర్నూలు నుంచి డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి బాలిక ఇంటి వద్ద నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట వెళ్తూ సమీపంలోని ముచ్చుమర్రి ఎత్తిపోత్తల పథకం వద్దకు డాగ్ స్క్వాడ్ చేరుకుంది. ఎత్తిపోతల వద్ద ఏర్పాటు చేసిన పార్క్‌లో కొద్దిసేపు తిరిగి బయటకు వచ్చి ఎత్తిపోతల అప్రోచ్ కాల్వ వెంట ఉన్న రాళ్ళ గుట్టల వెంట సుమారు నాలుగు కిలోమీటర్లకు పైగా వెళ్లాక డాగ్ నిలబడిపోయింది. అనంతరం కాల్వ అవతలి ఒడ్డున పాత ఎల్లాల సమీపంలోని కొలమన్న అనే రైతు పొలం వద్ద క్షుద్రపూజలు చేసినట్లు ఆనవాలు కనిపించాయి. పోలీసులు అక్కడికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. పొలంలో నిమ్మకాయలు, మట్టితో చేసిన బొమ్మ, పసుపు, కుంకుమ, కత్తిని పోలీసులు గుర్తించారు. బాలిక అదృశ్యమై రెండు రోజులు దాటిపోయినా ఆచూకీ తెలియకపోవడంతో బాలిక తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పాపం వాసంతి



నందికొట్కూరు/ పగిడ్యాల, జూలై 9: వాసంతి ఆదివారం సాయంకాలం ఆడుకోడానికి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాలేదు. కన్నవారికి ఆందోళన మొదలైంది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం విజయోత్సవ ర్యాలీలో ఉన్న ఎంపీ బైరెడ్డి శబరికి ఈ విషయం తెలిసింది. 24 గంటలకల్లా బాలిక ఆచూకీ కనుక్కోవాలని పోలీసులకు ఆదేశించారు. బాలికతో ముగ్గురు మైనర్లు వికృతంగా ప్రవర్తించి హత్య చేసినట్లు తెలిసింది. ఆదివారం సాయంత్రం కనిపించకుండా పోయిన పగిడ్యాల మండలం కొత్తముచ్చుమర్రి గ్రామానికి చెందిన మద్దిలేటి, సుజాతల రెండో కూతురు వాసంతి(9) పాత ముచ్చుమర్రి ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఆదివారం ముచ్చుమర్రి పార్కులో ఆడుకునేందుకు వెళ్లిన వాసంతి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం నంద్యాల ఎంపీ బైరెడ్డి డా.శబరి నందికొట్కూరు విజయోత్సవ ర్యాలీలో ఉండగా ఈ విషయం తెలిసింది. దీంతో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు, నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, పట్టణ సీఐ ప్రకాష్ కుమార్, ఎస్ఐలు నాగార్జున, జయశేఖర్, జగన్మోహన్, ఇతర పోలీసులు సిబ్బంది గత రెండు రోజులుగా దర్యాప్తు చేపట్టారు. మంగళవారం డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగడంతో ఒక చోట క్షుద్రపూజలు చేసిన చోట బాలిక దుస్తులు లభ్యమైనట్లు తెలిసింది. ముగ్గురు బాలురు పార్కులో ఆడుకుంటున్న చిన్నారిని కిడ్నాప్ చేస్తామని బెదిరించి తీసుకెళ్లి వికృతంగా ప్రవర్తించి అమానుషంగా హత్య చేసినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు ముగ్గురు బాలురను అదుపులోకి తీసుకొని విచారించగా సంఘటనా స్థలాన్ని చూపించినట్లు తెలుస్తోంది. బాలురు ఇచ్చిన సమాచారం మేరకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కాలువలో వాసంతి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ తెలిపారు.

ఉచిత ఇసుక విధానం అభినందనీయం

● టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న టీడీపీ నంద్యాల అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడం అభినందనీయమని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం ఇసుకను ఇతర రాష్ట్రాలకు అమ్ముకుని రూ. కోట్లల్లో సొమ్ము చేసుకోవడమే కాకుండా భవన నిర్మాణ కార్మికుల కడుపు కొట్టిందని మండిపడ్డారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు చాలా ఇసుక వల్ల ఇబ్బందులు పడ్డారన్నారు. ఇసుక దొరకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక పరిస్థితులు ఎదుర్కొని తినడానికి తిండి లేక పస్తులుండి రోడ్లపాలయ్యారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారం చేపట్టడంతో ఒక్కసారిగా అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం కల్పిస్తుందన్నారు. ఈ ఉచిత ఇసుక విధానంతో ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని దొరుకుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అవసరమైన వారు మాత్రమే ఇసుకను తీసుకెళ్లి ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోట్లను నాయకులు కొల్లగొట్టారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు బజారు, వేణు, సుధాకర్, రామగోవిందు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఎమ్మెల్యేకు అర్చకుల సన్మానం



ఎమ్మెల్యే గౌరు చరితకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో, అర్చకులు

పాణ్యం, జూలై 9: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత దంపతులను కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అర్చకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కర్నూలు కలిసి ఘనంగా సత్కరించారు. ఈవో రామకృష్ణ, అర్చకులు సురేష్‌శర్మ, కృష్ణయ్య, టీడీపీ నాయకులు మిలిటరీ సుబ్బారెడ్డి, పురుషోత్తంరెడ్డి, అన్నసత్రం మేనేజరు కృష్ణయ్య ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించి స్వామివారికి నివేదించిన తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా సహకార సొసైటీ దినోత్సవం

కొత్తపల్లి, జూలై 9: కొత్తపల్లిలోని నాగంపల్లి సహకార సొసైటీ ఆవరణలో మంగళవారం అంతర్జాతీయ సహకార సొసైటీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాన్ కీ బాత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేడీసీసీ బ్యాంకు సీఈవో విజయకుమార్ పాటు డీజీఎం ఉమామహేశ్వర రావు, ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పులిరాజు హాజరయ్యారు. రైతులు సహకార సొసైటీ నుంచి తీసుకున్న రుణాల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని కేడీసీసీ బ్యాంకు సీఈవో సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రసూల్, స్థానిక సీఈవో కోటేశ్వరరావు, సిబ్బంది శ్రీరాములు, లింగస్వామి, రామకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు: ఆర్జేడీ

పాణ్యం, జూలై 9: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కడప ఆర్జేడీ శామ్యూల్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు వండిన ఆహారాన్ని పరిశీలించారు. మెనూలో సాంబార్‌కు, రసానికి తేడా ఏమిటని సిబ్బందిని ప్రశ్నించారు. కర్రీ కోసం వండిన బీరకాయ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లేదని, ఇది ఎంత మంది పిల్లల కోసం సిద్ధం చేశారని మండిపడ్డారు. సిబ్బందికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీ శ్యామ్యూల్‌పాల్, ఎంఈవో కోటయ్య, ప్రిన్సిపాళ్లు లలితమ్మ, దినేష్‌బాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు అల్పాహారం

ఆత్మకూరు, జూలై 9: ఆత్మకూరు పట్టణంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి వర్షపునీరు చేరి ఇబ్బందులకు గురవుతున్న వరద బాధితులకు మంగళవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు చేయూతనిచ్చారు. ప్రత్యేకించి టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా ఆధ్వర్యంలో ఏకలవ్యానగర్, ఖుబ్రామసీద్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపునీరు చేరి వంట చేసుకునేందుకు కూడా ఇబ్బంది ఉన్న బాధిత కుటుంబాలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కల్పించారు. అదేవిధంగా మున్సిపల్ అధికారులతో చర్చించి ఆయా కాలనీల్లో వర్షపునీటికి యుద్ధప్రాతిపదికన తొలగించేలా చర్యలు చేపట్టారు. టీడీపీ నాయకులు పెట్రోబంకు బాషా, శ్రావణ్, నరసింహ, మల్లికార్జున తదితరులు ఉన్నారు.



అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రేషన్ దుకాణాలపై విచారణ

గడివేముల, జూలై 9: మండలంలోని బిలకలగూడురు గ్రామంలో 11, 13 రేషన్ దుకాణాలపై ఫిర్యాదులు రావడంతో మంగళవారం డీఎస్‌వో వెంకట్రాముడు విచారణ చేపట్టారు. లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి రేషన్ పంపిణీపై ఆరా తీశారు. రేషన్ దుకాణాల్లో స్టాక్‌ను, రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. 11వ షాపు డీలర్ లబ్ధిదారులకు అందుబాటులో ఉండటం లేదని, 13వ షాపు రేషన్ డీలర్ ప్రభుత్వం నుంచి వచ్చే సరుకులు తీసుకొని రావడం లేదని లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీటీ ప్రసాద్, వీఆర్వో వెంకటకృష్ణుడు పాల్గొన్నారు.

వసతి గృహం సందర్శన

ఆత్మకూరు, జూలై 9: ఆత్మకూరు పట్టణంలోని ఎస్సీ ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీశారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని నాయకులు ఎమ్ఆర్ నాయక్, దినేష్‌కుమార్ కోరారు. నాయకులు సాయి, దిలీప్, లింగేష్, రాజు, బాబు, రవి ఉన్నారు.

వరద ముంపు కాలనీల్లో పర్యటన

ఆత్మకూరు, జూలై 9: వరద ముంపు కాలనీలైన ఏకలవ్యానగర్, పద్మావతినగర్, హుసేన్‌సానగర్ తదితర ఏరియాల్లో మంగళవారం సీపీఎం నాయకులు పర్యటించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆత్మకూరు పట్టణంలో కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, నాగేశ్వరరావు కోరారు.

విత్తన ప్యాకెట్ల పంపిణీ

నందికొట్కూరు, జూలై 9: నందికొట్కూరు ఏడీఏ కార్యాలయం వద్ద విత్తన ప్యాకెట్లను వ్యవసాయశాఖ అధికారులు రైతులకు పంపిణీ చేశారు. మంగళవారం నందికొట్కూరు ఏడీఏ కార్యాలయం వద్ద జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు, కో- ఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణారావు, ఏడీఏ విజయశేఖర్, నందికొట్కూరు, మిడ్తూరు మండల వ్యవసాయ శాఖ అధికారులు షేక్షావలి, పీరు నాయక్ సంయుక్తంగా కలిసి రైతులకు వరి పంటలో బీపీటీ-5204 రకానికి ప్రత్యామ్నాయంగా అధిక దిగుబడినిచ్చే రకాలైన బీపీటీ-3082, బీపీటీ 2782 అనే రకాలను రైతులకు ఖరీఫ్ 2024 పంట కాలంలో సాగు చేసుకోవడానికి పంపిణీ చేశారు. రైతు సేవా కేంద్రాలు వీఏఏలు శాంతిరాజు, హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత'

నందికొట్కూరు రూరల్, జూలై 9: ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని టీటీడీ ధర్మప్రచార కర్త డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ వారితో మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవస్థాం నందు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సర్పంచ్ నాగలక్ష్మయ్య, దేవస్థాన అర్చకులు చంద్రశేఖరయ్య, జయరామిరెడ్డి, లక్ష్మీదేవమ్మ, విష్ణునాయుడు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'పంట కాలువలు నిర్మించాలి'

ఆత్మకూరు రూరల్, జూలై 9: మండలంలోని సిద్ధాపురం చెరువు కింద చివరి ఆయకట్టు వరకు పంట కాలువలు నిర్మించి చివరి భూములకు సైతం సాగు నీరు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, మండల అధ్యక్ష కార్యదర్శులు మాబాషా, వీరన్న కోరారు. మంగళవారం మండలంలోని కురుకుంద గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

'సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి'

గడివేముల, జూలై 9: పంట సాగులో సస్యరక్షణ చర్యలను సకాలంలో చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థాన శాస్త్రవేత్తలు శివరామకృష్ణ, ఎస్ఆర్ఎఫ్ హర్షవర్ధన్‌లు అన్నారు. మండలంలోని తిరుపాడు గ్రామంలో మంగళవారం మొక్కజొన్న, సోయాబీన్, పత్తి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం

- లోతట్టు కాలనీలు జలమయం
- నీట మునిగిన పంట పొలాలు
- ఉధృతంగా ప్రవహించిన వాగులు, వంకలు



ఆత్మకూరు మార్కెట్‌యార్డు ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు

ఆత్మకూరు, జూలై 9: ఆత్మకూరు పట్టణంలో సోమవారం రాత్రి 8.30 గంటల నుంచి మంగళవారం తెల్లవారుఝాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో 85.8 మిమీల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారు. ఆత్మకూరులోని ఏకలవ్యానగర్, ఇందిరానగర్, సాయిబాబానగర్, లక్ష్మీనగర్, గరీబ్‌నగర్, హుసేన్‌సానగర్, రహమత్‌నగర్ తదితర ఏరియాల్లోని లోతట్టు కాలనీలు నీటమునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా పట్టణంలోని కప్పలకుంట, అప్పారావువీధి, పోస్టాఫీసు ఏరియా, కేజీరోడ్డు తదితర ప్రధాన రహదారుల్లో కూడా సోమవారం రాత్రి వర్షపునీరు నిలిచిపోవడంతో జనం అసౌకర్యానికి లోనయ్యారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు ప్రాంగణంలోకి భారీగా వర్షపునీరు చేరుకోవడంతో కార్యాలయంలోకి వెళ్లేందుకు కూడా అవస్థలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గుండ్లకమ్మవాగు ఉధృతంగా ప్రవహించడంతో సమీప కాలనీల్లోని ఇళ్లలోకి వర్షపునీరు వెళ్లడంతో రాత్రంతా బాధిత కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి దాపరించింది. అంతేకాకుండా ఆత్మకూరుతో పాటు చుట్టుపక్కన గ్రామాల్లోని పంటపొలాల్లో భారీగా వర్షపునీరు నిలిచిపోవడంతో పంటలు కొంతమేర దెబ్బతిన్నాయి. పలుచోట్ల పంటపొలాలు చెరువులను తలపించేలా కనిపించాయి. అలాగే ఆత్మకూరు శివార్లలోని పడేవాగు, భవనాశి నదులు కూడా ఉధృతంగా ప్రవహించాయి. మండలంలోని పలు చెరువుల్లో కూడా నీటినిల్వలు పెరిగాయి. ఆత్మకూరు మండలంలోని కరివేన వద్ద జరుగుతున్న హైరోడ్డు విస్తరణ పనుల కారణంగా పంటపొలాల్లో కురిసిన నీరు చెరువులోకి వెళ్లేందుకు ఆటంకంగా మారింది. దీంతో చెరువులోకి వెళ్లేందుకు ఒకే ఒక్క వాగు ఉండటంతో ఆ ప్రదేశంలో కేజీరోడ్డుపై వర్షపునీరు ఉధృతంగా ప్రవహించింది. శ్రీపతిరావుపేట గ్రామ సమీపంలోని భవనాశి వాగు కూడా రోడ్డు ఎక్కి ప్రవహించింది.



చెలిమిళ్ల రహదారిలోని భవనాశి వాగులో నీటి ప్రవాహం



ఆత్మకూరు: చెరువును తలపిస్తున్న పంటపొలం

పాములపాడు: గత రెండురోజులుగా ఎగువన నలమల్ల అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భవనాశి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో సమీప పంట పొలాలు నీట మునిగాయి. మంగళవారం పాములపాడు చెలిమిళ్ల రహదారి, ఇస్కాల గ్రామ శివార్లలోని భవనాశి వాగు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో పాములపాడు, కంబాలపల్లి గ్రామ రైతులు వాహనదారులు ఇస్కాల గ్రామానికి వెల్లలేక ఇబ్బందులు పడ్డారు. వైసీపీ హయాంలో నందీశ్వర ఆలయం వద్ద వంతెన నిర్మాణాన్ని అధికారులు, నాయకుల నిర్లక్ష్యంతో వంతెన నిర్మాణం చేపట్టలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యం

- విజయోత్సవ సభలో టీడీపీ నాయకులు

పాములపాడు జూలై 9: టీడీపీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో మంగళవారం మండల సీనియర్ నాయకుడు తిమ్మారెడ్డి, మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభలో పాల్గొన్నారు. క్రిష్ణనగర్ గ్రామం నుంచి మద్దూరు వరకు ర్యాలీ నిర్వహించారు. మద్దూరులో సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ అధికారం చేపట్టిన రోజు నుంచే పెంచిన పింఛన్లు, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, అమరావతి పనులు ప్రారంభం, ఉచిత ఇసుక పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. నాడు జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకపోయిందని, అలాంటి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చాదిద్దే సత్తా విజన్ కలిగిన ఏకైక నాయకుడు చంద్రబాబు అన్నారు. నాయకులు పలుచాని మహేశ్వరరెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, బండ్లమూరి వెంకటేశ్వరరావు, గోవిందు, చంద్రశేఖర్, మధుకృష్ణ, హరినాథ్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి, బాలస్వామి, పూసల కృష్ణ, హఫీజ్, సత్యంరెడ్డి, ఏసేపు, అలీసాహెబ్, శివరామయ్య స్వాములు, మల్లీశ్వరరెడ్డి, రాములమ్మ, నాగలక్ష్మిరెడ్డి, కలీముల్లా, హరిప్రసాద్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకతో సొంతింటి కళ సాకారం: ఎమ్మెల్యే

నందికొట్కూరు రూరల్: రాష్ట్రంలో పేదల సొంతింటి కళ నేరవేర్చేందుకే ఉచిత ఇసుక పాలసీ విధానం అమలుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మంగళవారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర శివానందరెడ్డి నివాసంలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం అవలంభించిన విధానం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఇసుక సులభంగా దొరికేది కాదని అన్నారు. దీని వల్ల భవన నిర్మాణ కార్మికులు కూడా పనులు లేక చాలా ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ఉచిత ఇసుక విధానం అమలుకు జీవో నెంబర్ 43ని కూడా తీసుకుని వచ్చారని తెలిపారు. దీనివల్ల ఎంతో పారదర్శకత ఉంటుందని అన్నారు. ఇందుకు అనుగునంగా అధికారులు కూడా పేదవారికి సహకరించాలని తెలిపారు. మాండ్ర సురేంద్రనాథరెడ్డి, మహేశ్వరెడ్డి, నారపురెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సాగు నీరు సక్రమంగా అందించాలి: ఎంపీ



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ శబరి

నంద్యాల (కల్చరల్), జూలై 9: జిల్లాలో రైతులకు పంటలు సాగు చేసుకునేందుకు సాగునీరు సక్రమంగా అందించాలని, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాల సమస్య లేకుండా చూడాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సూచించారు. నంద్యాలలోని కలెక్టరేట్‌లో మంగళవారం నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలోని కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ ఆయకుట్టు రైతులకు సక్రమంగా సాగునీరు అందించక పంటలు ఎండిపోయాయన్నారు. గతంలో తప్పిదాలు పునరావృతం కాకుండా టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నంద్యాల రూరల్, జూలై 9: నంద్యాల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సౌభాగ్యమ్మ మంగళవారం తెలిపారు. మండల అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. గత మూడు నెలలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టనున్న అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌లు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు పాల్గొననున్నటు చెప్పారు.

'బాధ్యతగా పనిచేయాలి'

మిడుతూరు, జూలై 9: అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని అడిషనల్ సీడీపీవో మంగవల్లి అన్నారు. మిడుతూరు గ్రామంలోని ఒకటో, రెండో అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అడిషనల్ సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని, పిల్లలకు గుడ్డు ప్రతి రోజు అందించాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ రేణుకా ఉన్నారు.

జీపాట్‌లో విద్యార్థి ప్రతిభ

పాణ్యం, జూలై 9: గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీపాట్) 2024 ఫలితాలలో శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థి కె. తరుణ్‌కుమార్ జాతీయ స్థాయిలో 20వ ర్యాంకు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ చెట్టి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 8 వతేదీన విడుదలైన జీపాట్ పరీక్షా ఫలితాలలో తరుణ్ కుమార్‌తోపాటు మరో ఇద్దరు విద్యార్థులు 5 వేల లోపు ర్యాంకు సాధించారని చెప్పారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం.శాంతిరాముడు, ఎండీ శివరాం, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్‌లు అభినందించారు.



తరుణ్‌కుమార్

'పౌష్టికాహారంతో ఆరోగ్యం'

బండిఆత్మకూరు, జూలై 9: తల్లీబిడ్డ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు డాక్టర్ భావన, డాక్టర్ సవిత గర్భిణులకు సూచించారు. మంగళవారం బండిఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు బీపీ, షుగర్, హెచ్‌బీ, హెచ్‌ఐవీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఐరన్ మాత్రలు అందజేశారు. సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

కొత్తపల్లి: సీజన్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి మహ్మద్ బేగ్ సూచించారు. మంగళవారం ఆయన కొత్తపల్లి పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పోషకాహారం సంబంధించిన ఐరన్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి పీహెచ్‌సీ 24 గంటల వైద్యశాల కావడంతో కాన్పులు కూడా ఇక్కడే చేస్తున్నామని తెలిపారు.

ఆత్మకూరు రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని బైర్లూటి పీహెచ్‌సీలో మంగళవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 67 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం ప్రమాదానికి గురి కాగల ఇరువురు గర్భవతులను గుర్తించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. సూపర్‌వైజర్ రమణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ సోమేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ బేబి జ్యోతిలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

'భూసార పరీక్షలు తప్పనిసరి'

గోస్పాడు, జూలై 9: మండలంలోని పలు గ్రామాల పరిధిలో భూ సార పరీక్షలను వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. మంగళవారం ఏవో స్వప్నిక ఆధ్వర్యంలో రైతు శిక్షణా కేంద్ర అధికారి ఉమ, ఏఈవోలు, వ్యవసాయ సహాయక బృందం భూ సార పరీక్షలు చేశారు.

'నవధాన్యం సాగుతో భూసారం పెరుగుదల'

పాణ్యం, జూలై 9: నవధాన్యం సాగుతో భూసారం పెరుగుతుందని ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఫండ్ డీపీఎం నరేంద్రరెడ్డి అన్నారు. మండలంలోని సుగాలిమెట్టలో మంగళవారం రైతు సాధికారిక సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరిస్తూ నవధాన్య సాగు విధానం వల్ల పెరిగే భూసారం గురించి రైతులకు వివరించారు. ఏడీపీఎం సలాం, సెర్ప్ అధికారులు సరేష్, సీసీ రఘురాం, ఎంటీ విజయభాస్కర్, యూనిట్ ఇన్‌చార్జి కుమార్ ఆచారి, ఐసీఆర్పీ రామనాయక్, అశోక్, సుమిత్రబాబు, రైతులు పాల్గొన్నారు.

'సాగునీరు అందడం లేదు'

పాణ్యం, జూలై 9: మండలంలోని కొండజూటూరు రైతులు తమ పంటలకు నీరు అందడం లేదని రైతులు అన్నారు. మంగళవారం కలెక్టరు రాజకుమారిని కలిసి తమ సమస్యను వివ రించారు. కొందరు చెరువును ఆక్రమించుకోవడానికి నీరు నిల్వ ఉండకుండా అలుగును ధ్వంసం చేశారని ఫిర్యాదు చేశారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి: డీవైఎఫ్ఐ

బండిఆత్మకూరు, జూలై 9: ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, జిల్లా నాయకుడు మధుశేఖర్ కోరారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణంలో డీవైఎఫ్ఐ మండల సమావేశం నిర్వహించారు. ముందుగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శివ, రాముడు, శ్రీకాంత్, నాగమల్లయ్య రాజేష్, సురేష్ పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ కార్యకర్త



టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకుంటున్న కార్యకర్త

పాణ్యం, జూలై 9: ఎమ్మెల్యేగా గౌరు చరిత గెలిచి తెలుగుదేశం అధికారంలోకి వస్తే 101 టెంకాయలు పెద్దమ్మ అమ్మవారికి కొడతామన్న మొక్కును టీడీపీ కార్యకర్త తీర్చుకున్నారు. మండలంలోని కందికాయపల్లిలో మంగళవారం టీడీపీ కార్యకర్త మండ్ల ఈశ్వరయ్య స్థానిక పెద్దమ్మ అమ్మవారికి కుంకుమ, పసుపు సారెతో ఊరేగింపుగా కార్యకర్తలు, నాయకుల ఆధ్వర్యంలో డప్పులు, టపాకాయల మోతలతో ర్యాలీగా వెళ్లి ఆలయం వద్ద 101 టెంకాయలు కొట్టి తన మొక్కును తీర్చుకున్నారు. పెద్దమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, నారాయణ, లక్ష్మయ్య రమేష్, పరమేష్, శివశంకర్, నాగన్న, నాగేంద్ర, శివ, గోవిందు, ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

మహానంది, జూలై 9: మహానందిలో భక్తుల కోసం దేవస్థానం అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆలయ అర్చకులు మామిళ్ళపల్లి రాఘవశర్మ రూ.10,116 విరాళంగా అందచేసినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయం ప్రాంగణంలోని దేవస్థానం విరాళాల కౌంటర్‌లో అర్చకులు విరాళం అందచేశారన్నారు. అనంతరం దాతకు స్వామివారి ప్రసాదాలు అన్నదానం బాండును అందచేసామన్నారు. విరాళాల కౌంటర్ ఇన్‌చార్జి గురువయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

గడివేముల, జూలై 9: మండలంలోని కరిమద్దెల గ్రామంలోని హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థినులకు బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి అన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'హెల్మెట్ తప్పనిసరి'

నంద్యాల (నూనెపల్లె), జూలై 9: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి శివారెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా రవాణాశాఖ అధికారి కార్యాలయ ఆవరణంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. డీటీవో మాట్లాడుతూ.. ఈ నెల 31 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ఉద్యోగులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 9: నంద్యాలలోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని యూనియన్ నాయకులు, ఎల్ఐసీ ఉద్యోగులు కలిసి వినతి పత్రం అందజేశారు. బీమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలు, ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీని తొలగించాలని ఏఐఐఈఏ ఎల్ఐసీ సెక్రటరీ రమేష్ బాబు డిమాండ్ కోరారు.

కలెక్టర్‌ను కలిసిన సీపీఎం నాయకులు

నంద్యాల (కల్చరల్), జూలై 9: సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సీపీఐ నాయకులు కోరారు. కలెక్టర్ రాజకుమారిని కలిసి బొకే అందజేశారు. నాయకులు రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్, భాస్కర్, మోటారాముడు, నాగరాముడు, సోమన్న, శ్రీనివాసులు, సామేలు, హరినాథ్, భార్గవ్, సంజీవులు, మహేశ్వరమ్మ తదితరులు తెలిపారు.

గంగమ్మ జాతర

నంద్యాల (నూనెపల్లె), జూలై 9: వర్షాలు బాగా పడి పంటలు బాగా పండాలని రైతులు సుభిక్షంగా ఉండాలని రజకులు పట్టణ శివార్లలోని చిన్న చెరువు వద్ద గంగమ్మ జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. పేద రజకులకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని ఏపీ రజక ఎస్సీ సాధన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రజక సంఘం నాయకులు మద్దిలేటి, ఆంజనేయులు, హనుమంతు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూలై 9: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అన్ని పాఠశాలలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు సిలబస్ ను సకాలంలో పూర్తిచేసి మెరుగైన ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి అలసత్వం లేకుండా మొనూ తప్పనిసరిగి పాటిస్తూ ఆహార పదార్థాలు విద్యార్థులకు ఇవ్వాలన్నారు. ప్రతిపాఠశాలలో టాయిలెట్స్ పరిశుభ్రతతో పాటు, ఆర్‌వో ప్లాంటు కచ్చితంగా వుండాలన్నారు. విద్యార్థులు రెగ్యులర్ యూనిఫామ్‌తో షూష్, బెల్ట్ తప్పనిసరిగా ధరించేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష, పంచాయతీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

- జిల్లాలో అపార ఖనిజ సంపద ఉందని, అక్రమ రవాణా పాల్పడకుండా నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి గనులశాఖ ఏడీని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ చాంబర్‌లో గనుశాక ప్రగతిపై జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. గనులశాఖ ఏడీ రామచంద్ర పాల్గొన్నారు.
- కలెక్టరేట్‌లోని కార్యాలయంలోని అన్ని సెక్షన్ల ఉద్యోగులు, సిబ్బంది క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వహించి నాణ్యతతో పనులు చేయాలని కలెక్టర్ రాజకుమారి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ తదితరలు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

కొత్తపల్లి, జూలై 9: కొత్తపల్లి కేజీబీవీని ఎంఈవో-2 ఇనయతుల్లా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నిధుల కొరతతో నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ గత ఏడాది కాలంగా నిధుల కొరతతో నిలిచిపోయిన కొత్తపల్లి కేజీబీవీలోని అదనపు గదుల నిర్మాణాలకు ఉన్నతాధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే పాఠశాలలో హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి పాఠశాలలోని పలు సమస్యలను ఎంఈవో దృష్టికి తీసుకువచ్చారు.

కాపర్ వైర్ చోరీ

మిడుతూరు, జూలై 9: మిడుతూరు, సుంకేసుల గ్రామ రైతుల పొలాల్లో రాత్రికి రాత్రే వ్యవసాయ బోరు బావుల దగ్గర కాపర్ వైరును చోరీ చేశారు. మిడుతూరు, సుంకేసుల గ్రామాలకు చెందిన 15 మంది రైతుల కాపర్ వైరు స్టాటర్ నుంచి బోరు మోటారు వరకు కట్ చేసి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం రైతులు వెళ్లి మోటార్లు నడవడం లేదని చూడగా కేబుల్ వైర్లు లేక పోవడంతో కాపర్ వైర్లు దొంగలించినట్లు రైతులు గుర్తించారు. గతంలో కూడ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయని బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

మిడుతూరు, జూలై 9: మండలంలోని రోళ్లపాడు గ్రామ పొలిమేరలో ఉన్న రోళ్లపాడు చెరువు సమీపంలో కుక్కదాడిలో జింక మృతి చెందింది. రోళ్లపాడు అభయ అరణ్యం చుట్టు పక్కల పొలాల్లో కంచె లేనందున, పొలాల్లోకి వచ్చిన జింకను కుక్కలు వెంబడించి దాడి చేయడంతో అక్కడికి అక్కడే జింక మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయం స్థానిక డీఆర్వో జిహన్ తహేర్‌ను వివరణ కోరగా కుక్కల దాడిలో జింక మృతి చెందినట్లు తెలిపారు.

'కనీస వేతనాలు ఇవ్వాలి'

శ్రీశైలం, జూలై 9: శ్రీశైలం దేవస్థానంలో పొరుగుసేవల కింద విధులు నిర్వహించే సిబ్బందికి ఏజెన్సీల ద్వారా కనీస వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం నేషనల్ వర్కర్స్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. కాశయ్య డిమాండ్ చేశారు. ఏజెన్సీల ద్వారా ఒక్కో ఉద్యోగికి ఎంత వేతనం, పీఎఫ్ చెల్లింపులపై విచారణ చేయాలని కోరారు. నిబంధనలను అనుసరించి తక్కువ వేతనాలను అందజేస్తున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలన్నారు.

పంటసాగుపై రైతులకు అవగాహన

పాణ్యం, జూలై 9: ట్రైకొడర్మావిరిడి జీవ సిలీంద్రనాసినితో విశిష్ట ఉపయోగాలు రైతులు పొందవచ్చని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ తెలిపారు. మండలంలోని బలపనూరులో మంగళవారం పరిశోధన స్థానం సైంటిస్టుల ఆధర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ట్రైకొడర్మావిరిడి అనే పశువుల ఎరువులతో అధిక నిష్పత్తిలో ఎలా తయారు చేసుకోవాలో ప్రదర్శన ద్వారా తెలిపారు. వంద కిలోల పశువుల ఎరువుతో పది కిలోల వేపపిండి, మూడు కిలోల ట్రైకోడర్మావిరిడి, కిలో కరిగించిన బెల్లం నీటితో ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా తెలిపారు. కార్యక్రమంలో సైంటిస్టులు డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సతీష్, జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ సరళమ్మ, ఏవో చంద్రశేఖర్, జీవ నియంత్రణ ప్రయోగశాల సైంటిస్టు డాక్టర్ శశికళ, మాజీ ఎంపీపీ దేరెడ్డి ఆదిశేషారెడ్డి, సుబ్బారెడ్డి, ఏవో జయప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ప్రభుత్వ శాఖలను ప్రక్షాళన చేస్తున్నాం

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అవుకు జూలై 9: గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ శాఖలన్నింటిని ప్రక్షాళన చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంగళవారం అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారి అవుకు పట్టణానికి వచ్చిన బీసీ జనార్దన్ రెడ్డికి టీడీపీ సీనియర్ నాయకులు ఐవీ పక్కీరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఐ. ఉగ్రసేనారెడ్డి, టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణనాయక్, బత్తిన మద్దిలేటి గౌడు, దంతెల రమణ, తిక్కన్న ఆధ్వర్యంలో కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అవుకులోని ఎస్సార్బీసీ గెస్ట్‌హౌస్‌లో మండలంలోని ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల వారిగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలను మరిచిపోనన్నారు. గతంలో కొందరు అధికారులు వైసీపీ తొత్తులుగా మారి పరిపాలనను భ్రష్టు పట్టించారని విమర్శించారు. వైసీపీ నాయకులు చివరకు ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసి అక్రమించుకున్నారన్నారు. టీడీపీ కక్షసాధింపు చర్యలకు దిగదని అయితే అధికారాన్ని అడ్డుపెట్టుకొని తప్పులు చేసిన వైసీపీ నాయకులను, వారికి కొమ్ముకాసిన అధికారులపై విజిలెన్స్ విచారణ జరుగుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒక్క ఇసుక కుంభకోణం ద్వారా రూ. 50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, మొట్ల రామిరెడ్డి, గూడాల ప్రతాప్‌రెడ్డి, మురళీధరరెడ్డి, ఎస్. రామక్రిష్ణారెడ్డి, మారం.భాస్కర్‌రెడ్డి, ఈరన్నగారి శ్రీనివాసులు, వేములపాడు గుర్రప్ప, ఆకులనాగిరెడ్డి, మారం పుల్లారెడ్డి, నారపురెడ్డి, నాగమునెయ్య, బాలనాగిరెడ్డి, బైరెడ్డి భాస్కర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, జగన్, అరుణ్‌నాయక్, వెంకట రాముడు నాయక్ పాల్గొన్నారు.

గూడాల శివరామిరెడ్డికి మంత్రి బీసీ పరామర్శ: అవుకు మండలం కునుకుంట్ల గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు గూడాల శివరామిరెడ్డిని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. కునుకుంట్ల గ్రామానికి చేరుకున్న బీసీ గ్రామ టీడీపీ నాయకులు గూడాల ప్రతాప్‌రెడ్డి, మురళీధరరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం శివరామిరెడ్డి ఆరోగ్య పరిస్థితిని బీసీ జనార్దన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి: బీసీ

బనగానపల్లె: బనగానపల్లె నియోజవర్గంలోని సమస్యలు పరిష్కరించుకునేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని, ఎవరైనా నేరుగా వచ్చి తనను సంప్రదించవచ్చని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు మంత్రి బీసీని కలిశారు. బీసీ ఓపికతో సమాధానాలు చెప్పారు. వివిధ శాఖల అధికారులు మర్యాద పూర్వకంగా బనగానపల్లె టీడీపీ కార్యాల యంలో మంత్రిని కలిశారు. మంత్రి బీసీని కలసిన వారిలో నంద్యాల జిల్లా ట్రెజరీ, అకౌంట్స్ అధికారి లక్ష్మీదేవి, సిబ్బంది, రాయలసీమ రీజనల్ ఫైర్‌స్టేషన్ అధికారి భూపాల్‌రెడ్డి, కడప క్వాలి టీ కంట్రోల్ ఎస్‌ఈ శివకుమార్, కడప క్వాలిటీ కంట్రోల్ ఈఈ గీతారాణి ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

డయాలసిస్ రోగులను ఆదుకోవాలి

కొలిమిగుండ్ల: బనగానపల్లె నియోజకవర్గంలో డయాలసిస్ రోగులను ఆదుకోవాలని ఉమ్మడి జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు పులి ప్రకాశ్‌రెడ్డి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ అవసరమైన రోగులు కొలిమిగుండ్ల మండలం లో 9మంది ఉండగా, బనగానపల్లె నియోజకవర్గంలో 43మంది ఉన్నారని పులి ప్రకాశ్‌రెడ్డి వివరించారు. బనగానపల్లె ఆసుపత్రిలో డయాలసిస్ పరికరాలను అందుబాటులోకి తీసుకరావాలని విజ్ఞప్తి చేయగా, మంత్రి సానుకూలంగా స్పందించారని పులి ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా గొర్విమానుపల్లె గ్రామంలో సెల్ ఫోన్ సిగ్నల్స్ అందడంలేదని, టవర్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.





సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి, బీసీని కలిసిన ఉమ్మడి జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు పులి ప్రకాశ్‌రెడ్డి

వైసీపీ ఇక కనుమరుగే..

» మాజీ సీఎం జగన్ జపం చేసుకోవాల్సిందే

» డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, జూలై 9: రాష్ట్రంలో వైసీపీ ఇక కనుమరుగైనట్లేనని కేంద్ర మాజీ మంత్రి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం జరిగిన దాడుల్లో తీవ్రంగా గాయపడిన వెంకటనాయునిపల్లి గ్రామానికి చెందిన మాదయ్యను మంగళవారం కర్నూలులోని ఓ ఆసుపత్రిలో ఎమ్మెల్యే కోట్ల పరామర్శించారు. అదే విధంగా డోన్‌లోని పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పాలనతో రాష్ట్ర ప్రజల కళ్లల్లో ఆనందం చూస్తున్నామన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకను బ్లాకుల్లో అమ్ముకుంటూ ఇష్టారాజ్యంగా దోపిడీ చేశారని విమర్శించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, సీనియర్ న్యాయవాది భాస్కర్ రెడ్డి, డోన్, బేతంచెర్ల మండలాల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, ఎల్ల నాగయ్య, ఎరుకుల చెరువు శివ పాల్గొన్నారు.

ఉచిత ఇసుకతో ప్రగతిబాట: సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, జూలై 9: సీఎం చంద్రబాబు అమలు చేసిన ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోపే ఎన్నికల హామీలను నెరవేరుస్తూ వస్తోందన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు పింఛన్లను రూ.4వేలకు పెంచారని, ఉచిత ఇసుక పాలసీని అమలు చేసి నిర్మాణ రంగానికి జీవం పోశారన్నారు.

మూడు రోజులకోసారైనా నీరివ్వండి

» ఆగ్రహించిన సంజామల గ్రామస్థులు

» సచివాలయం ముట్టడి

సంజామల, జూలై 9: ఊరికి చెంతనే పాలేరు వాగు పారుతున్నా తాగు నీటికి ఇబ్బందిపడుతున్నామని, కనీసం మూడు రోజులకు ఒక్కసారైనా నీరు ఇవ్వాలని సంజామల గ్రామస్థులు మంగళవారం సచివాలయాన్ని ముట్టడించారు. పంచాయతీ కార్యదర్శులు గోపీనాథ్, భారతిలకు నీటి సమస్యను వివరించారు. ప్రధానంగా గ్రామంలోని సాలేపేట, ముస్లిం వీధి, కమలమ్మ బావి వీధులకు నీరందక 10రోజులు అవుతుందని మాజీ ఎంపీటీసీ యాసుఫ్ హుసేన్, మండల కోఆప్షన్ సభ్యులు మగ్బుల్ హుసేన్, మహమ్మద్ హుసేన్, రెడ్డి మగ్బూల్, షాకీర్ హుసేన్, కోరె సుబ్బయ్య, సుబ్రమణ్యం, శేఖర్ తదితర 20 మంది సమస్యలు వివరిం చారు. గ్రామంలో ప్రతి కాలనీకి నీరు చేరేలా పనిచేస్తామంటూ అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు వెనుతిరిగారు.

కుడా అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న సర్పంచ్ మెట్ల సరళ

కోవెలకుంట్ల, జూలై 9: కోవెలకుంట్లలో మేజరు గ్రామ పంచాయతీ పరిధిలో బిల్డింగు నిర్మించుకోవాలన్నా, లే అవుట్లు ఏర్పాటు చేసుకోవాలన్నా ఉమ్మడి కర్నూలు జిలా కుడా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఈవోఆర్డీ రాధికారెడ్డి అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని మేజరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మెట్ల సరళ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి కర్నూలు జిల్లా కుడా ప్లానింగ్ సెక్రటరీలు విజయ్‌రామ్, సీహెచ్ రవిప్రసాద్, ఆర్.వినయ్ హాజరై కుడా అనుమతి, ఆన్‌లైన్ పద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ్‌రామ్ మాట్లాడుతూ 2019 ఆగస్టు నుంచి నిర్మించిన బిల్డింగులు, లే అవుట్లకు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టిన వాటిపై తనిఖీలు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా నిర్మించి ఉంటే వాటికి నోటీసులు అందించి తదనంతరం వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. 300 స్క్వైర్ మీటరు కంటే తక్కువ ఉంటే గ్రామ పంచాయతీ అధికారుల ద్వారా ఆన్‌లైన్ పద్ధతి ద్వారా పర్మిషన్‌లు పొందవచ్చన్నారు. ఆ పైన ఉంటే కుడా ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలన్నారు. ఉప సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈవో గోపీనాథ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో అధిక లాభాలు

బనగానపల్లె, జూలై 9: రైతులు పామాయిల్ సాగుచేసి అధిక లాభాలు గడించాలని నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజశేఖర్ కోరారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని పొదుపు భవనం కార్యాలయంలో ఉద్యానవన అధికారి రఘువరన్, తుమ్మ ఆగ్రోస్ ప్రైవేట్ కంపెనీ చైర్మన్ తుమ్మల ఆంజనేయులు పామాయిల్ తోట సాగు, వాటి వివరాలను, రాయితీల గురించి వ్యవసాయ సహాయకులకు వివరించారు. ఈ సందర్భంగా బనగానపల్లె మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈసారి జిల్లాలో పెద్ద ఎత్తున పామాయిల్ తోటల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, రైతులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

సంజామల, జూలై 9: కౌలు రైతులు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి మంగళవారం కోరారు. భూములు లేని రైతులు ప్రభుత్వం అందజేసే కౌలు కార్డు తీసుకుంటే వ్యవసాయ సంబంధిత రాయితీలు వర్తిస్తాయన్నారు. రైతు భరోసా మినాయించి విత్తనాలు, ఎరువులు, పంటల ఉత్ప త్తులు, విక్రయాలు సైతం కౌలు రైతులకు వర్తిస్తుందన్నారు.

'చంద్రన్న బీమాకు దరఖాస్తు చేసుకోవాలి'

రుద్రవరం, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వం చంద్రన్న బీమాకు కొత్తగా జీవో నెంబరు 344 మంజూరు చేసిందని, దరఖాస్తు చేసుకోవాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ మంగళవారం తెలిపారు. ఆకస్మిక మరణం చెందిన వారి వివరాలు, సరైన ధ్రువీకరణ పత్రాలతో మార్చి 16 నుంచి జూన్ 30 వరకు సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా చంద్రన్న బీమా లాగిన్‌లో అప్‌లోడ్ చేయించుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే చంద్రన్న బీమా వర్తిస్తుందన్నారు.

బాధితుడికి సర్పంచ్ పరామర్శ

డోన్(రూరల్), జూలై 9: డోన్ మండలం వెంకటనాయునిపల్లెలో పొలంగట్టు వివాదంలో ప్రత్యర్థుల చేతుల దాడుల్లో తీవ్రంగా గాయపడిన బాధితుడు మాదయ్యను సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు పరామర్శించారు. రెండు రోజుల క్రితం జరిగిన దాడిలో గాయపడి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాదయ్యను పరామర్శించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న దేవరాజ్ తదితరులు

కోవెలకుంట్ల, జూలై 9: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగుల జేఏసీ అధ్యక్షుడు దేవరాజ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ రాజకుమారిని కలిసి దివ్యాంగుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు, డబుల్ బెడ్‌రూములు కట్టించాలని, బ్యాంకు రుణాలు, మూడు చక్రాల బండ్లను పంపిణీ చేయాలని కోరారు. అలాగే నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని కలిసి దివ్యాంగుల సమస్యలు పరిష్కరిం చాలని కోరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుబ్బరాయుడు, ఓబులేసు, సువర్ణ, గురప్ప పాల్గొన్నారు.

రూ.2.70 లక్షలు చోరీ

నంద్యాల, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని సత్రం వీధిలో రూ.2.70 లక్షలు మంగళవారం చోరీకి గురయ్యాయి. రుద్రవరం మండలం మందలూరు గ్రామానికి చెందిన లింగమూర్తి రెడ్డి ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రధాన ఎస్‌బీఐలో రూ.4.70 లక్షలు డ్రా చేసుకొని రూ.2 లక్షలు రసాయనిక ఎరువుల దుకాణంలో చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని తన మోటార్ సైకిల్ ట్యాంకు కవరులో ఉంచుకున్నారు. తన గ్రామానికి వెళ్తూ ఆళ్లగడ్డ పట్టణంలోని సత్రం వీధి మొదట్లో ఉన్న టైలరు షాపులో ఇచ్చిన పిల్లల యూనిఫాం తీసుకోవడానికి మోటార్ సైకిల్‌ను టైలర్ షాపు ముందుంచి వెళ్లారు. అయితే దుస్తులు తీసుకొని వచ్చేలోగా ట్యాంకు కవరులో ఉన్న రూ.2.70 లక్షలు కన్పించడం లేదని ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ నగీనా తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

రుద్రవరం, జూలై 9: రుద్రవరం పోలీసు స్టేషన్ పరిధిలో నల్లమల అటవిలో తుండ్లవాగు సమీపంలో మంగళవారం సుందర రామయ్య (84) అనే వృద్ధుడి మృతదేహం లభించినట్లు ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు. మృతదేహం వద్ద ఆధార్ కార్డు లభించడంతో చిరునామా గుర్తించగలిగామని చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆచార్య కాలనీకి చెందిన సుందర రామయ్య శనివారం అహోబిళం వెళుతున్నట్లు ఇంటి వద్ద చెప్పి వచ్చారు. సుందర రామయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. కొన్ని రోజులపాటు కుమార్తెల వద్ద ఉండేవారు. జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. రామయ్య కుమారుడు వేణుగోపాలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి శవ పరీక్ష చేయించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

'పౌష్టికాహారంతో ఆరోగ్యం'

దొర్నిపాడు, జూలై 9: గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి రుహుల్లాఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతమ్మ ఆధ్వర్యంలో వంద రోజుల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రవి, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

'ధ్వజస్తంభం ఏర్పాటు చేయాలి'

రుద్రవరం, జూలై 9: రుద్రవరంలో మాన్యం భూములకు కౌలు వేలం నిర్వహించేందుకు వచ్చిన ఆంజనేయస్వామి ధ్వజస్తంభం గాలివానకు కూలిందని, ఇంత వరకు ఏర్పాటు చేయలేదని ఏర్పాటు చేయాలని మంగళవారం గ్రామస్థులు ఈవో సాయి జయచంద్రారెడ్డిని కోరారు. దేవాలయంపై నిర్లక్ష్యం ఎందుకని, అప్పటి నిధులు ఏమయ్యాయని స్థానికులు ఈవోను ప్రశ్నించారు.

'భూసార పరీక్షలు తప్పనిసరి'

చాగలమర్రి, జూలై 9: గ్రామాల్లో రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ పేర్కొన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని రైతు పొలంలో మట్టి నమూనాలను సేకరించారు. ఈ మట్టిని భూసార పరీక్షా కేంద్రానికి పంపిస్తామని చెప్పారు. వ్యవసాయ సిబ్బంది ఫరూక్, రైతులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కమిటీ అధికారులు

చాగలమర్రి, జూలై 9: చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని త్రిసభ్య కమిటీ అధికారులు తహసీల్దార్ రమణమ్మ, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఎంఈవో అనూరాధ మంగళవారం పరిశీలించారు. నాణ్యతగల భోజనం అందించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో సమస్యల గురించి హెచ్ఎం కోటయ్యను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ సుబ్బరాయుడు, సీఆర్పీ అమీర్‌ఖాన్, పీడీ దాదాపీర్ పాల్గొన్నారు.

గంగమ్మకు బోనాలు

నంద్యాల, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలన్న లక్ష్యంతో ఆళ్లగడ్డ ఆశ్రమం వీధిలో ఉన్న గంగమ్మకు మంగళవారం మహిళలు బోనాలు సమర్పించారు. వందలాది మహిళలు గంగమ్మకు బిందెలతో జలాభిషేకం చేశారు. ఈ ఏడాది వర్షాలు కురిసి పాడి పంటలతో కళకళలాడాలని ఆకాక్షించారు.

శాకాంబరి అలంకారంలో గంగమ్మ

చాగలమర్రి, జూలై 9: చాగలమర్రి గ్రామంలోని చిన్నమకానం వీధి సమీపంలో వెలసిన గంగమ్మ ఆలయంలో ఆషాడమాసం సందర్భంగా గంగమ్మ శాకాంబరి అలంకారంలో కొలువుదీరారు. మహిళలు గంగమ్మకు పండ్లు, కూరగాయలు, పూలు వివిధ ఆకులతో అలంకరించి కొలువుదీర్చారు. పది దీపాలతో ప్రత్యేక హారతులు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బేతంచెర్ల, జూలై 9: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనం దరిపై ఉందని నగర కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని కొత్తబస్టాండు సమీపంలో ఉన్న ధరణి కాలనీలో రోడ్ల వెంట కమిషనర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఏఈ శేఖర్, రమణ, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య'

శిరివెళ్ల, జూలై 9: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు ఎంఈవో-2 నాగార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని గోవిందపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినులకు యూనిఫామ్స్ మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు అందించినట్లు ఆయన తెలిపారు.

'రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం'

నంద్యాల, జూలై 9(ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యమని కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ రేణుక అన్నారు. వ్యవసాయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆమె మాట్లాడుతూ రైతులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆళ్లగడ్డ కేడీసీసీ బ్యాంకు సిబ్బందితో కలిసి ఆవరణలో మొక్కలు నాటారు.

'డెంగీతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జూలై 9: డెంగీతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండలంలోని చింతలచెరువు, పెద్దవంగలి గ్రామాల్లో సీజన్ వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు సుల్తాన ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. సీహెచ్‌వో చంద్రకళ, ఏఎన్ఎం వేదమణి, హెచ్ఏ మనోహర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆలయ భూములకు కౌలు వేలం

రుద్రవరం, జూలై 9: రుద్రవరం గ్రామంలో భాస్కర నందీశ్వర, ఆంజనేయ, దొర్వి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల భూములకు కౌలు వేలం మంగళవారం ఈవో సాయి జయచంద్రారెడ్డి నిర్వహించారు. 36.79 ఎకరాలకు కౌలు వేలం నిర్వహించారు. ఈ ఏడాది రూ.3,31,500 ఆదాయం వచ్చింది. గత ఏడాది రూ2.5 లక్షలు ఆదాయం వచ్చింది. అదనపు ఆదాయం రూ.81,500 దేవాలయానికి చేకూరింది.

ఎరువుల విక్రయం నిలుపుదల

బేతంచెర్ల, జూలై 9: పట్టణంలోని ఎరువులు, విత్తనాలు దుకాణాల్లో సరైన రికార్డులు లేని రూ.10 లక్షల విలువ చేసే ఎరువులను విక్రయించకుండా నిలిపేయాలని వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఎరువులు, పురుగుల మందులు, విత్తన దుకాణాలను ప్రత్యేక స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా పట్టణంలోని శ్రీరేణుకా మాత ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, శ్రీనంది ఫర్టిలైజర్స్, కోరమాండల్ దుకాణాల్లో బృందం సభ్యులు తనిఖీ చేశారు. డీడీఏ సుబ్రహ్మణ్యం దుకాణాల్లో ఎరువులు, పురుగుల మందుల విత్తనాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్‌లను, ఇన్వాయిస్ రూ.10 లక్షలు విలువ చేసే ఎరువుల అమ్మకాలు సరైన రికార్డులు చూపనందుకు వీటి అమ్మకాలు నిలుపుదల చేయాలన్నారు. విజిలెన్స్ శాఖ సీఐ సునీల్ కుమార్, మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డోన్(రూరల్): డోన్ పట్టణంలో నాలుగు ప్రధాన ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పల్నాడు జిల్లాకు చెందిన డీడీఏ సుబ్రహ్మణ్యం, కృష్ణా జిల్లా మైలవరం ఏడీఏ శ్రీనివాస్‌లు, విజిలెన్స్ అధికారులు, విజిలెన్స్ సీఐ సునీల్, కిష్టప్పలు బేతంచెర్లలో రెండు దుకాణాలు, డోన్ మండలంలోని నాలుగు దుకాణాలు తనిఖీ చేసి ఎరువులు, విత్తనాలకు సంబం ధించి సరైన ధృవపత్రాలు లేనివి గుర్తించారు. దీంతో రూ.10.60 లక్షలు విలువ చేసే ఎరువుల విత్తనాల అమ్మకాలను వారం రోజుల పాటు నిలిపివేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో డోన్ వ్యవసాయ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌షఫీ పాల్గొన్నారు.



డోన్‌లో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయాధికారులు

ఆలయంపై ఎందుకీ నిర్లక్ష్యం?

ధ్వజస్తంభం స్థానంలో వెదురుకర్ర

రుద్రవరం, జూలై 9: ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభం కూలిపోయి నెలలు గడుస్తున్నా దేవదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటి? అని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుద్రవరంలోని ప్రతాప రుద్ర ఆంజనేయస్వామి దేవాలయంలో ఇటీవల గాలివానకు ధ్వజస్తంభం విరిగిపోయింది. ధ్వజస్తంభం స్థానంలో వెదురుకర్రఏర్పాటు చేశారు. ధ్వజస్తంభం ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ధ్వజస్తంభం లేకుండా దేవాలయంలో పూజలు ఎలా చేయాలని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై దేవదాయశాఖ ఈవో జయచంద్రరెడ్డితో మాటాడుతూ ధ్వజస్తంభం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఆంజనేయస్వామి ఆలయం ధ్వజస్తంభం స్థానంలో నిలిపిన వెదురుకర్ర

హెల్మెట్ తప్పనిసరి: ఆర్టీవో



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో క్రాంతి కుమార్

డోన్(రూరల్), జూలై 9: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ సూచించారు. మంగళవారం సాయంత్రం ఆర్టీవో కార్యాలయం వద్ద వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం తలకు తీవ్ర గాయాలై మృత్యువాత పడుతున్నారన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

బనగానపల్లె, జూలై 9: బనగానపల్లె పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త సలికమేని మద్దిలేటి (50) మృతి చెందడం బాధాకరమని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బీసీ రాజారెడ్డి మద్దిలేటి మృతదేహంపై పూలమాలలు వేసి మంగళవారం నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ సంతాపం వ్యక్తం చేశారు.



మృతదేహంపై పూలమాల వేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

ప్రశాంతంగా మొహర్రం జరుపుకోవాలి



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్‌రెడ్డి

ప్యాపిలి, జూలై 9: మండలంలో మొహర్రం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఆయన ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. మతసామరస్యానికి ప్రతీకగా ఉన్న మొహర్రం వేడుకలను అందరూ కలసి కట్టుగా నిర్వహించుకోవాలన్నారు. వేడుకల్లో ఘర్షణలకు పాల్పడిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

మొహర్రం ప్రారంభం

చాగలమర్రి జూలై 9: హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీక మొహర్రం. మంగళవారం నుంచి పండుగ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. లాల్‌స్వామి కమిటీ సభ్యులు ఆయా మకానాల్లో పీర్లను కొలువుదీర్చారు. ఆయా మకానాలను విద్యుత్ బల్బులతో, చలువ పందిర్లతో ముస్తాబు చేశారు. పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ రమణయ్య తెలిపారు.

కొలిమిగుండ్ల: మండలంలోని తిమ్మనాయినిపేట, మీర్జాపురం తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా చిన్న సరిగెత్తు, మధ్య సరిగెత్తు, పెద్ద సరిగెత్తు నిర్వహించి మొహర్రం పదో రోజు షహదత్ వేడుకలను నిర్వహిస్తారు.

రాయితీ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్యాపిలి, జూలై 9: ఉద్యానవన శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ అధికారి కళ్యాణి అన్నారు. మంగళవారం మండలంలోని కలచట్ల గ్రామంలో రైతు శ్రీనివాసులుకు రాయితీపై పవర్ ట్రిల్లర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ పవర్ ట్రిల్లర్ విలువ రూ.80వేలు చేస్తుందన్నారు. అయితే రాయితీతో ఈ యంత్రాన్ని రైతకు రూ.40వేలుకు అందజేయడం జరిగిందన్నారు. యంత్రాలు కావల్సిన రైతులు తమను సంప్రదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలచట్ల ప్రసాద్, రైతులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.